క్లుప్తంగా

యూరియా అందుబాటులో ఉంచాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రైతులకు అవసరమైన సన్నరకం యూరియాను అందుబాటులో ఉంచాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం వి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రబీలో రైతులకు అవసరమైన సన్నరకం యూరియాను అందుబాటులో ఉంచాలని కోరుతూ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జి. చంద్ర పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో కమ్యూనిస్ట్ నేత కె. సుబ్బన్న 16వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

సమాజ సేవకు జవహర్‌రెడ్డికి పురస్కారం

కడప కోటిరెడ్డిసర్కిల్ : సమాజ సేవ చేసినందుకు డాక్టర్ జవహర్‌రెడ్డికి పురస్కారం అందజేసినట్లు రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బృంద వృద్ధాశ్రమంలో 8వ వార్షికోత్సవం సందర్భంగా పురస్కారాన్ని అందజేశారు.

'బ్రౌన్'కు 300 పుస్తకాలు

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, కడప కోటిరెడ్డి కోడలు కోటిరెడ్డి పద్మావతమ్మ మంగళవారం తమ వ్యక్తిగత గ్రంథాలయానికి చెందిన 300 పుస్తకాలను సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి అందజేశారు. ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డిలు వాటిని స్వీకరించారు.

పెద్దదర్గాలో ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న నటులు అన్నురెడ్డి, మహేష్ విట్టా, భూపాల్‌రాజు

కడప కల్చరల్ : కడప అమీన్‌పీర్ (పెద్ద) దర్గాను మంగళవారం టీవీ నటులు దర్శించుకున్నారు. బిగ్‌బాస్ ఫేం, నటి అన్నురెడ్డి, మహేష్ విట్టా, భూపాల్‌రాజు గురువుల మజార్ల వద్ద ప్రార్థనలు చేశారు.

రైల్వేలైన్‌కు నిధులు కేటాయించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర ప్రభుత్వం కడప–బెంగుళూరు రైల్వే లైన్‌కు నిధులు కేటాయించాలని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. రవి శంకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రైల్వే లైన్‌కు నిధులు కేటాయించాలని కోరుతూ కడప రైల్వే మేనేజర్ నరసింహా రెడ్డికి ఆర్‌సీపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు మగ్బూల్ భాష, చాపల సుబ్బరాయుడు, ప్రసాద్, తస్లీమ్ తదితరులు పాల్గొన్నారు.

4న తిరువన్నామలైకు ప్రత్యేక సర్వీసు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఫిబ్రవరి 4వ తేదీ తిరువన్నామలైకు కడప రీజియన్ పరిధిలోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడపనున్నామని ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేలు డిపోల నుంచి ఈ బస్సులు బయలుదేరుతాయన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ప్యాకెట్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మల్లికార్జునరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్రీయ విద్యాలయ తల్లిదండ్రులు ప్యాకెట్ క్యాలెండర్‌ను తీసుకురావడం అభినందనీయమని ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ మల్లికార్జునరెడ్డి అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో కేంద్రీయ విద్యాలయ స్కూలు చిల్డ్రన్స్ పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు రూపొందించిన ప్యాకెట్ క్యాలెండర్‌ను చైర్మన్ ఆవిష్కరించారు. కేంద్రీయ వి ద్యాలయ స్కూలు చిల్డ్రన్స్ పేరెంట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఉమేష్, కోశాధికారి జితేంద్ర, ఉపాధ్యక్షులు మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

సంతృప్తిగా సంక్షేమ పథకాలు

ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా



శిలా ఫలకం ఆవిష్కరణలో పాల్గొన్న డిప్యూటీ సీఎం అంజద్‌బాష

కడప కార్పొరేషన్ : పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు సంతృప్తి చెందేలా సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతోందని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా 87వ రోజు 41వ డివిజన్లోని రవీంద్రనగర్‌లో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల వల్ల ఆయా కుటుంబాలకు కలుగుతున్న లబ్ధిని వివరించారు. ఈ ప్రభుత్వంలో పొందిన లబ్ధిని తెలుపుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతకంతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో 41వ డివిజన్ ఇన్‌చార్జి జమాల్‌వలీ, వైఎస్ఆర్‌సీపీ నాయకులు షఫీ, రెడ్డి ప్రసాద్, కరీంజిలానీ, బాలస్వామిరెడ్డి, అజ్మతుల్లా, రామలక్ష్మణ్ రెడ్డి, తోటక్రిష్ణ, సుబ్బారెడ్డి, ఉమైర్, టీపీ వెంకట సుబ్బమ్మ, బండి మరియలు, రత్నకుమారి, నారాయణమ్మ, రామలక్షుమ్మ పాల్గొన్నారు.

ఔషధ నియంత్రణ శాఖ బలోపేతానికి చర్యలు

కడప రూరల్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో భాగంగా ప్రభుత్వం ఔషధ నియంత్రణ శాఖ పటిష్టవంతానికి చర్యలు చేపడుతున్నట్లు డిప్యూటీ సీఎం అంజద్‌బాష అన్నారు. మంగళవారం కడప ప్రభుత్వ సర్వ జన ఆసుపత్రి ప్రాంగణంలో డెంటల్ ఆసుపత్రి వద్ద రూ. 80 లక్షల వ్యయంతో నిర్మించిన జిల్లా ఔషధ నియంత్రణ పరిపాలన నూతన కార్యాలయం భవనంను అంజద్ బాష ప్రారంభించారు. డిప్యూటీ మేయర్లు నిత్యానందరెడ్డి. ముంజాత్‌బేగం, హజ్ హౌస్ చైర్మన్ గౌస్‌లాజం, కార్పొరేటర్ షఫి, వైఎస్సార్‌సీపీ నాయకులు జమాల్‌బాష, జిల్లా ఔషధ నియంత్రణ శాఖ ఏడీ నాగకిరణ్‌కుమార్, ఏఓ శంకర్, డ్రగ్ కంట్రోల్ ఆఫీసర్ జయరాముడు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప కల్చరల్ : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెన్షనర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు మంగళవారం స్థానిక పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి జి.శివశంకర్‌రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది జనవరి నుంచి పదవీ విరమణ చేస్తున్న ఏపీజీబీ విశ్రాంత ఉద్యోగులు, కొత్త ఫ్యామిలీ పెన్షనర్లకు రావాల్సిన ప్రావిడెంట్‌ఫండ్ నిధులు, పెన్షన్ చెల్లింపులను పీఎఫ్ జాతీయ కార్యాలయం పూర్తిగా నిలిపి వేయడం బాధాకరమన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రావిడెంట్ ఫండ్ అధికారులు ఇంత వరకు ఎలాంటి నిర్మాణాత్మకమైన చర్యలు చేపట్టలేదన్నారు. కార్యక్రమానికి మద్దతుగా ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నాయకులు ఎ.రఘునాథరెడ్డి మాట్లాడుతూ సర్వీసులో ఉన్నప్పుడు పొదుపు చేసిన ఈ మొత్తాల చెల్లింపు విషయంలో జాప్యం సహించరాదన్నారు. కార్యక్రమంలో భాగంగా పీఎఫ్ కార్యాలయం వద్ద కడప, కర్నూలు, ఒంగోలు, అనంతపురం, నెల్లూరు, తిరుపతి, బాపట్ల, నంద్యాల, కదిరి, అన్నమయ్య జిల్లాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. ఏపీజీబీ బ్యాంకు యూనియన్ నాయకులు శివారెడ్డి, జగదీష్‌రెడ్డి, మహమ్మద్, విశ్రాంత ఉద్యోగులు నరేంద్రరెడ్డి, లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం ప్రధాన కార్యదర్శి జి.శివశంకర్‌రెడ్డి

ఏపీజీబీ ఉద్యోగుల శ్రమదానం

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం ఆధ్వర్యంలో ఆ బ్యాంకు అధికారులు, సిబ్బంది శ్రమదానం చేశారు. మంగళవారం స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా వారు వీధులను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ కె. విజయ్ భాస్కర్, బీఎస్ పద్మనాభరావు, ఎం. జగదీశ్వరరావు, చీఫ్ కంప్లెయిన్స్ ఆఫీసర్ ఎల్. మార్తండ చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

8 నుంచి కోదండరాముని వార్షికోత్సవాలు

కడప కల్చరల్ : కడప హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయం 23వ వార్షికోత్సవాలను ఈ నెల 8 నుంచి నిర్వహించనున్నామని ఆలయ నిర్వాహకులు వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం ఆలయంలోని ధార్మికవేదికపై ఆయన ఇతర సభ్యులతో కలిసి కరపత్రాలను విడుదల చేసి ఉత్సవ వివరాలు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి 7 వరకు పూజోత్సవాలు ఉంటాయన్నారు.

మాతా శిశు సంరక్షణకు చర్యలు

కడప రూరల్: వైద్య సిబ్బంది మాతా శిశు సంరక్షణకు అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మాతా శిశు సంరక్షణకు సంబంధించి ఆశా నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ మల్లీశ్వరి ,ఉమాపతి, రూతమ్మ, పాలేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. .

ప్రమాద బాధితుడికి రూ.50 వేల ఆర్థిక సాయం



ప్రమాదంలో గాయపడిన వినోద్ కుమార్‌రెడ్డికి ఆర్థిక సాయం చేస్తున్న రాచమల్లు రవిశంకర్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : జిల్లాలోని మైదుకూరు నియోజకవర్గం ఖాజీపేటలోని త్రిపురవరం (చియ్యపాడు) గ్రామానికి చెందిన మహానందిగారి వినోద్ కుమార్‌రెడ్డి అనే యువకుడికి వైఎస్సార్‌పీ సేవాదళ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్లు రవిశంకర్‌రెడ్డి రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. వినోద్ కుమార్‌రెడ్డి ఇటీవల ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెన్నుపూస మూడు చోట్ల విరిగిపోయి తిరుపతిలోని అమర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలిసిన వెంటనే వారి కుటుంబ సభ్యులతో మాట్లాడిన రాచమల్లు రవిశంకర్‌రెడ్డి తిరుపతికి వెళ్లి వారి కుటుంబసభ్యులకు రూ.50 వేలు అందించారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్ కింద డబ్బు ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మాలలు ఐక్యతతో అభివృద్ధి చెందాలి

కడప కార్పొరేషన్ : మాలలు ఐక్యతతో అభివృద్ధి చెందడం కోసమే జై భీమ్ మాల మహాసేన ఆవిర్భవించిందని ఆ మహాసేన అధ్యక్షుడు పి. సంపత్ కుమార్ అన్నారు. జై భీమ్ మాలమహాసేన మొదటి వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక మాసాపేటలోని వారి కార్యాలయంలో బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆ మహాసేన ఉపాధ్యక్షుడు బండి రమణ, ప్రధాన కార్యదర్శి చైతల్య, కోశాధికారి శ్యాంసన్, కార్యదర్శి బి. చిన్ని, సీహెచ్ వినోద్ కుమార్, కార్యవర్గ సభ్యులు కె. లావణ్య, రత్నకుమారి, సుశీలమ్మ, వసంత్, ఇరగయ్య, చంద్ర, అయ్యవారయ్య, కె. సుబ్బరాయుడు, నాగార్జున, ప్రణవతి పాల్గొన్నారు.

ఆడపిల్లల చదువుతోనే మహిళా సాధికారత సాధ్యం



మాట్లాడుతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆడపిల్లల చదువుతోనే మహిళా సాధికారత సాధ్యమని సర్వశిక్ష అభియాన్ పీఓ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఎం.లక్ష్మీదేవిలు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జిల్లాలో ఉన్న హిందూ మత పెద్దలు, పురోహితులకు బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారి ఎంఎస్ రాణి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి బీఆర్ సుభాష్ యాదవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్లు, ఐసీడీఎస్ అధికారులు జి.సునీత, సునీతరాజు, ప్రసన్న, విజయ, వినోద్‌కుమార్, మహేశ్వర, యూనుస్‌బాష, గోవిందరాజు, జగదీష్ బాబు, మునీంద్ర, డీసీపీయూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ పీటీడీ కడపజోన్ పరిధిలో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య, జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు కె.కృష్ణకుమార్, ఎన్ఆర్ శేఖర్‌లు తెలిపారు. మంగళవారం కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపినాథ్‌రెడ్డికి ఈమేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. అన్నమయ్య జిల్లా కార్యదర్శి పీఎస్‌బీ రెడ్డి, వైఎస్సార్ జిల్లా కార్యదర్శి రామ్మూర్తి, నాన్ ఆపరేషన్ రీజినల్ అధ్యక్ష, కార్యదర్శులు రంగనాథ్, అంకిరెడ్డి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల నియంత్రణకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు

కడప కార్పొరేషన్ : అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(అనుడ) పరిధిలో అక్రమ నిర్మాణాల నియంత్రణకు పంచాయతీ, మండల, మున్సిపల్ స్థాయిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ఏర్పాటు చేయాలని అనుడ వైస్ చైర్మన్ వై.ఓ.నందన్ అన్నారు. మంగళవారం అనుడ చైర్మన్ గురుమోహన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో 10 అంశాలను ప్రతిపాదించి ఆమోదించారు. ఇందులో ముఖ్యంగా అనుడ పరిధిలో ఎల్‌టీపీ, డెవెలపర్స్, రియల్టర్స్‌గా నమోదు చేసుకునటకు అవకాశం కల్పించేందుకు ప్రతిపాదనలు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీడీటీపీ దేవీ కుమారి, జీఎం డీఐసీ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేపడతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి. ఓబులేసు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణమూర్తి, ఎల్. నాగ సుబ్బారెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

వైవీయూలో కేంద్ర బడ్జెట్‌పై వెబినార్ నిర్వహణ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ఆర్థికశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ×ప్రీ యూనియన్ బడ్జెట్ విశ్లేషణ–2023× అన్న అంశంపై వర్చువల్ విధానంలో వెబినార్ నిర్వహించారు. ఈ వెబినార్‌లో గోవాలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆర్థికశాఖ ఆచార్యులు దేబాసిస్ పటానాయక్ మాట్లాడారు. వైవీయూ ఆర్థికశాఖ విభాగాధిపతి ఎం. అనిత మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్థికశాఖ సహ ఆచార్యులు డా. టి. సుదర్శన్‌రెడ్డి, డా. ఎన్. గణేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దలను దైవంతో సమానంగా భావించాలి

సీనియర్ సివిల్ జడ్జి కవిత



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కవిత

కడప కోటిరెడ్డిసర్కిల్ : పెద్దలు దైవంతో సమానమని భావించాలని సీనియర్ సివిల్ జడ్జి కవిత, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రవిప్రకాశ్‌రెడ్డిలు తెలిపారు. మంగళవారం నగర శివార్లలోని బృంద వృద్ధాశ్రమంలో వృద్ధాశ్రమ 8వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్జి కవిత, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రవిప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ బృంద వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేసి వృద్ధులకు సేవలు అందిస్తున్న బాలసుబ్బయ్య అభినందనీయుడన్నారు. బాలసుబ్బయ్య మాట్లాడుతూ దాతల సహకారం మరువలేనిదని తెలిపారు. అనంతరం పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను జడ్జి కవిత ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, న్యాయవాది జీకే రామలింగారెడ్డి, సీనియర్ న్యాయవాది భారవి, సీకే దిన్నె ఎస్ఐ అరుణకుమార్‌రెడ్డి, రిటైర్డ్ సూపరింటెండెంట్ శివప్రసాద్, ఏఆర్ మూర్తి, అంకయ్య, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రహమతున్నీసా, ఎస్ఎండీ తాహీర్, పుల్లగూర శ్రీనివాసులు, ప్రసన్న, శివశంకర్, మేము సైతం రవి, వృద్ధాశ్రమ మేనేజర్ సుధారాణి, పాస్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సంక్షేమానికి పెద్దపీట

ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



పోలీసుశాఖ రూపొందించిన డైరీ -2023 ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ అన్బురాజన్

కడప అర్బన్ : జిల్లాలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది, వారి కుటుంబాలకు ఎలాంటి ఆపద కలిగినా తాను అండగా వుండి వారి సంక్షేమానికి కృషి చేస్తామని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ హామీ ఇచ్చారు. మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ పోలీస్ అధికారుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పోలీస్ డైరీ -2023 ను ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్షేత్రస్థాయి పోలీసు సిబ్బందికి ఉపయోగపడే ప్రభుత్వ ఉత్తర్వులు, సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ , శాఖాపరమైన సంక్షేమ పథకాలపై సమగ్ర సమాచారాన్ని ఈ డైరీ ద్వారా సిబ్బందికి అందజేయడంపై జిల్లా పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులను అభినందించారు. గత సంవత్సరంలో జిల్లా పోలీసులు సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని ఈ నూతన సంవత్సరంలో కూడా సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో విధులు నిర్వర్తించి ప్రజలకు విలువైన, నాణ్యమైన సేవలు అందించడం ద్వారా పోలీసుశాఖకు మంచిపేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఏఆర్ డీఎస్పీ రమణయ్య, డీపీఓ ఏఓ జ్యోతి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, కార్యదర్శి యోగా రాయల్, కో–ఆప్షన్ సభ్యులు రామకృష్ణ, మాధవి, శివకుమారి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపొందించాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని ఎస్‌బీఐ కాలనీలో ఉన్న శ్మశానవాటికలో మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలని కమిషనర్ ప్రవీణ్ చంద్ ఆదేశించారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన 40, 47, 46వ డివిజన్లలో పర్యటించి పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపులా బెంచీలు ఏర్పాటు చేయాలని, శ్మశానవాటిక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. అనంతరం 45వ డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రం, భగత్‌సింగ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.

అనంతరం భగత్‌సింగ్ నగర్ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద నిర్మిస్తున్న పార్కును పరిశీలించి ఫిబ్రవరి 20 నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జాతీయ పెన్షనర్ల దినోత్సవం

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం కళాక్షేత్రంలో గురువారం జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.చెన్నారెడ్డి, ఎస్.రామ్మూర్తి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, కమలాపురం శాసనసభ్యులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, నగర మేయర్ సురేష్‌బాబు, కలెక్టర్ విజయరామరాజు, ఇతర ఉన్నతాధికారులు కార్యక్రమానికి హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లాలో 75 సంవత్సరాలు పైబడిన 80 మంది తమ సంఘ సభ్యులకు ఈ సందర్భంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని పెన్షనర్లు ఈ కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.